andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
బుధవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 39.8 । కనిష్ఠం 24.8

ఆదిలాబాద్
జిల్లా వార్తలు
5
గురువారం 28 మార్చి 2024

రంజాన్ వేళలు

గురువారం	శుక్రవారం
ఇఫ్తార్ :	సహర్ :
సా. 6.34	ఉ. 4.51

ప్రజలను దోప్పి పొడవడంలో, పరోక్షంగా వారి లోపాలను ఎంచడంలో ఆసక్తి కనబరిచే ప్రతీ ఒక్కరికి వినాశం తప్పదు.





● పెన్‌గంగాలో చేపడుతున్న ఇసుక తవ్వకాలు

ఇసుక తోడేళ్లు!

పెన్ గంగాలో తవ్వుకునోడికి తవ్వుకున్నంత..!

- సరిహద్దు మండలాల్లో రెచ్చిపోతున్న ఇసుక మాఫియా
- పెన్‌గంగాలో వరద నీటిని మళ్లిస్తూ అడ్డగోలుగా ఇసుక తవ్వకాలు
- అక్రమార్కులకు మంచి ఆదాయ మార్గంగా మారిన నది
- కొన్నాళ్లు హడావుడి చేసి.. సైలెంటై పోయిన మైనింగ్ శాఖ


● పెన్‌గంగాలో నిలిచిన వరద నీరు

ఆదిలాబాద్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి)

జిల్లాలో ఇసుక తోడేళ్లు రెచ్చిపోతున్నారు. పెన్‌గంగా నదిలో తవ్వుకున్నోడికి తవ్వుకున్నంతగా ఇసుక అక్రమ తవ్వకాలు జోరుగా జరుగుతున్నాయి. ఇసుక దొంగలు దోపిడీ దందాకు తెగబడుతున్నారు. గతేడు నదికి భారీ వరదలు రావడంతో పుష్కలంగా ఇసుక మేటలు అందుబాటులో ఉన్నాయి. వేసవి కాలం కావడంతో నదిలో వరద ఉధృతి తగ్గిపోయింది. ఇదే అదునుగా నది పరివాహక ప్రాంతంలో ఉన్న సరిహద్దు గ్రామాల వీడీసీలు టెండర్లు పెట్టి మరీ యథేచ్ఛగా ఇసుకను అమ్మేసుకుంటున్నా.. అధికార యంత్రాంగం ప్రేక్షక పాత్ర వహిస్తుందన్న ఆరోపణలు వస్తున్నాయి. ముఖ్యంగా బేల, జైనథ్, తాంసి, తలమడుగు, భీంపూర్ మండలాల్లో జోరుగా అక్రమ ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయి. జిల్లాలో ఎక్కడ అధికారిక ఇసుక రీచ్‌లకు అనుమతులు లేకపోయినా.. నిత్యం వందల వాహనాలలో ఇసుకను తరలిస్తూ అమ్మేసుకుంటున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే మైనింగ్ మాఫియాపై ఉక్కుపాదం మోపుతామని ప్రకటించడంతో.. అధికారులు కొంత హడావుడి చేసినా.. మళ్లీ మామూలుగానే మారిపోయింది. జిల్లాలో నిత్యం అక్రమ ఇసుక తవ్వకాలు జోరుగా జరుగుతూనే ఉన్నాయి. ఇదేదో రాత్రిపూట రహస్యంగా జరుగుతుందంటే పొరపాటే పట్టపగలే యథేచ్ఛగా అక్రమదందా సాగుతున్న అధికారులు మామూలుగానే తీసుకుంటున్నారన్న విమర్శలు వస్తున్నాయి. ప్రభుత్వ ఉన్నతాధికారుల ఆదేశాలతో గత నెల రోజుల పాటు స్పెషల్ డ్రైవ్‌ను నిర్వహించి కట్టడి చేసే ప్రయత్నం చేసిన ప్రయోజనమే లేకుండా పోయింది. జిల్లా అధికారి బదిలీతో మళ్లీ పరిస్థితి మొదటికే వచ్చిందన్న వాదనలు వినిపిస్తున్నాయి. రెవెన్యూ, మైనింగ్, పోలీసు శాఖల అధికారుల మధ్య సమన్వయం లేకపోవడంతో.. అక్రమ ఇసుక దందాకు అడ్డుకట్ట పడడం లేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

● అంతా మా ఇష్టం

నదిలో ప్రవహిస్తున్న వరద నీటికి అడ్డుకట్ట వేస్తూ అడ్డగోలుగా ఇసుక తవ్వకాలను చేపడుతున్నారు. పెన్‌గంగాలో అంతా మా ఇష్టమంటూ ఇసుక మాఫియా రెచ్చిపోతోంది. ఇసుక టెండర్లను దక్కించుకుంటున్న మాఫియా భారీ యంత్రాలతో తవ్వకాలను చేపట్టడంతో పెన్‌గంగా నదిలో భారీ గుంతలు ఏర్పడుతున్నాయి. ఇదంతా బహిరంగంగానే జరుగుతున్న అధికారులు నిఘా సారించక పోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నిత్యం వందలాది టిప్పర్లు, లారీలు, ట్రాక్టర్ల ద్వారా ఇసుకను తరలించుకుపోతున్నా.. అడ్డుకునే వారే కనిపించడం లేదు. జైనథ్, బేల మండలాల్లోని సాంగ్వి, డోలార, పెండల్వాడ, ఆనంద్‌పూర్ గ్రామ సమీపాలలో నది నీటిని మళ్లించి ఇసుక తవ్వకాలను చేపడుతున్నారు. గతంలో నది నీటికి అడ్డుకట్ట వేయడంతో అధికారులు అడ్డుకుని తొలగించారు. అలాగే నది నుంచి ఇసుకను తరలించేందుకు యథేచ్ఛగా అడ్డదారులు వేస్తూ అక్రమదందాకు ఎగబడుతున్నారు. నది ఒడ్లను ధ్వంసం చేయడంతో భారీ వరదలు వచ్చిన సమయంలో పంట చేనులోకి వరద నీరు చేరుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

● పొరుగు రాష్ట్రానికి తరలింపు

జిల్లా సరిహద్దుల్లో ఉన్న మహారాష్ట్రకు యథేచ్ఛగా ఇసుకను తరలిస్తూ అమ్మేసుకుంటున్నారు. సరిహద్దుల్లో నిఘా కరువవడంతో ఇసుక మాఫియాకు అడ్డూ అదుపే లేకుండా పోయింది. సరిహద్దు చెక్‌పోస్టులు ఉన్న అధికారులు కూడా అడ్డుచెప్పడం లేదన్న విమర్శలు వస్తున్నాయి. మహారాష్ట్రలోని బడా కాంట్రాక్టర్లతో కుమ్మక్కవుతున్న ఇసుక మాఫియా రాత్రీ పగలు అనే తేడా లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారు. మహారాష్ట్రలో అధికారులు ఇసుక తవ్వకాలపై కఠినంగా వ్యవహరించడంతో జిల్లా నుంచే భారీగా ఇసుకను తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. అలాగే జిల్లాలోని పలు అభివృద్ధి పనులకు ఇసుకను సరఫరా చేస్తున్న మాఫియా ఇది చాలదంటూ మహారాష్ట్రలోని మాండ్వి, కిన్వట్, పాటన్‌బోరీ, పాండ్రకవడ, ఇతర ప్రాంతాలకు రాత్రికి రాత్రే ఇసుకను సరఫరా చేస్తూ అమ్మేసుకుంటున్నారు. అడ్డు వచ్చిన అధికారులకు మామూళ్లు ముట్టచెప్పి తమ దందాకు అడ్డు అదుపు లేకుండా చేసుకుంటున్నారు. మహారాష్ట్రలో ఇసుకకు భారీ డిమాండ్ ఉండడంతో కొందరు అధిక ధరలకైనా టెండర్లను దక్కించుకుంటున్నారు. సరిహద్దు దాటే వరకు మాది బాధ్యత అంటూ భరోసా కల్పించడంతో మహారాష్ట్ర నుంచి నిత్యం వందలాది వాహనాలు జిల్లా సరిహద్దుల్లో క్యూ కడుతున్నాయి.

● అధికార పార్టీలోకి అక్రమార్కులు

తమ అక్రమదందాలను కాపాడుకునేందుకు కొందరు నేతలు అధికార పార్టీలో చేరిపోతున్నారన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మొన్నటి వరకు బీఆర్‌ఎస్ పార్టీలో పెత్తనం చెలాయించిన నేతలు ప్రస్తుతం కాంగ్రెస్‌లో చేరేందుకు క్యూ కడుతున్నారు. ఇలా ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీ నేతలదే పెన్‌గంగా నది పై పెత్తనం అన్నట్లుగా మారింది. నేతలు చెప్పిన వారికే టెండర్లు దక్కడం పరిపాటిగా మారింది. నది సరిహద్దు మండలాలైన భీంపూర్, తాంసి, జైనథ్, బేల మండలాల్లోని అధికార పార్టీ నేతలు చెప్పిందే ఫైనల్‌గా మారుతుంది. మాట వినని అధికారులపై వేటు వేసేందుకు సిద్ధమవుతున్నారు.కాదు కూడదంటే మండల స్థాయి అధికారులపై బదిలీ వేటు వేయడం మామూలుగానే మారింది. కొందరు నేతలైతే అక్రమ ఇసుక దందా కోసమే అధికార పార్టీలో చేరిపోయి కండువా వేసుకుంటున్నట్లు తెలుస్తుంది. కొన్ని గ్రామాల్లోనైతే అధికార పార్టీతో పాటు బీజేపీ, బీఆర్‌ఎస్ నేతలంతా కలిసి కమిషన్లను పంచుకుంటున్నట్లు ఆరోపణలున్నాయి. అధికార, ప్రతిపక్ష నేతలంతా ఒక్కటి కావడంతో జిల్లా స్థాయి అధికారులకు ఫిర్యాదు చేసే వారే కరువవుతున్నారు. దీంతో అక్రమ ఇసుకదందాకు అడ్డుకట్ట పడడం లేదంటున్నారు. ఇకనైనా అధికారులు సీరియస్‌గా దృష్టి సారిస్తే సరిహద్దుల్లో విచ్చలవిడిగా సాగుతున్న ఇసుక దందాకు బ్రేకులు పడే అవకాశం ఉంది.

నిధులు మంజూరైనా.. ముందుకు సాగని పనులు

● పనులు చేపట్టాలని అధికారులను వేడుకున్న గిరిజనులు


ఐటీడీఏ ఈఈతో మాట్లాడుతున్న గిరిజనులు

ఉట్నూర్, మార్చి27: మండలంలోని వంకతుమ్మ గ్రామానికి రోడ్డు, వంతెన పనుల నిర్మాణం కోసం మంజూరైన నిధులతో పనులు వేగవంతం చేసి తమకు రవాణా సౌకర్యం కల్పించాలని వంకతుమ్మ గిరిజనులు కోరుతున్నారు. ఈ మేరకు బుధవారం ఐటీడీఏ కార్యాలయానికి చేరుకుని గిరిజన సంక్షేమ శాఖ ఈఈ రాథోడ్‌భీమ్‌రావును కలిసి నిధులు మంజూరైనందువల్ల రోడ్డు వంతెన పనులు చేపట్టి తమకు ఇబ్బందులు తొలగించాలని వేడుకున్నారు. ప్రభుత్వం వంక తుమ్మ రహదారి, వాగు పై వంతెన నిర్మాణం కోసం కోటి రూపాయలు మంజూరు చేసినప్పటికీ.. అటవీ శాఖాధికారులు అనుమతులు లేక పోవడంతో పనులు చేయలేక పోతున్నామని టైగర్‌జోన్‌లోని కోర్ ఏరియాలో రోడ్డు వంతెన ఉండడంతో అటవి శాఖ అధికారులు అంగీకరించడం లేదని అటవీ శాఖ అనుమతుల కోసం ఐటీడీఏ పీఓ ద్వారా కలెక్టర్‌కు నివేదిక ఇవ్వడం జరిగిందని అనుమతులు రాగానే పనులు చేపడతామని ఆయన వారికి వివరించారు. ఈ సందర్భంగా గ్రామపటేల్ మేస్రందేవ్‌రావు మాట్లాడుతూ.. దశాబ్దాల కాలంగా తమ గ్రామాలకు రోడ్డు సౌకర్యం లేకపోవడంతో ప్రతియేటా వర్షాకాలంలో వంకతుమ్మ వాగు పొంగడంతో నాలుగు నెలల పాటు బాహ్య ప్రపంచానికి దూరంగా ఉంటున్నామని వివరించారు. వర్షాకాలంలో తమ ప్రాంతాల గిరిజనులు ఏదైనా వ్యాధులకు గురైతే ఆసుపత్రికి కూడా చేరుకోలేక ఇబ్బందులు పడుతున్నామని ప్రభుత్వానికి ఈ విషయం తెలిపి తమ గ్రామానికి మంజూరైన రోడ్డు నిర్మాణంతో పాటు వాగు పై వంతెన నిర్మించాలని గిరిజనులు తొడసం సుందర్‌షావ్, ఆత్రంభీమ్‌రావు, కోసేరావులు కోరారు.


బోరిగామలో ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న డీఆర్‌డీవో సాయన్న

పనిచేసే ప్రతీ ఒక్కరికి కూలీ డబ్బుల జమ

- పని చేసే ప్రదేశాల్లో కూలీలకు అన్ని సదుపాయాలు కల్పించాలి
- డీఆర్‌డీవో సాయన్న

ఇచ్చోడ, మార్చి27: ఉపాధి హామీ పథకంలో భాగంగా రోజు కూలీ సగటున రూ.272 ప్రభుత్వం నిర్ణయించిందని.. పనిచేసే ప్రతిఒక్కరికి కూలీ డబ్బులు జమ అవుతాయని డీఆర్‌డీవో సాయన్న అన్నారు. బుధవారం మండలంలోని బోరిగామ గ్రామపంచాయతీ పరిధిలో జరుగుతున్న ఉపాధి పనులను ఆయన పరిశీలించారు. శ్రమకు తగ్గ డబ్బులు రావడంలేదని కూలీలు ఆయనతో వారి ఇబ్బందులను తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పనిచేసే ప్రతి ఒక్కరికి కూలీ డబ్బులు జమ అవుతాయన్నారు. అలాగే పని ప్రదేశాల్లో సేద తీరడానికి షామియానాలు, తాగునీటి సదుపాయం, ప్రథమ చికిత్స కిట్లు అందుబాటులో ఉంచేలా చర్యలు చేపట్టాలని ఉపాధి సిబ్బందికి సూచించారు. ఆయన వెంట ఎంపీడీఓ లక్ష్మణ్, సాంకేతిక సహాయకురాలు సునీత, ఎఫ్ఏ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

టెట్ అర్హత ఫీజును తగ్గించాల్సిందే : సంతోష్

నేరడిగొండ, మార్చి27: అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ అతితక్కువ ఫీజులతో పోటీ పరీక్షలు నిర్వహిస్తామని చెప్పిందని.. కానీ ఇప్పుడు అందుకు విరుద్ధంగా టెట్ ఫీజు పెంచారని, వెంటనే ఆ ఫీజును తగ్గించాలని బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి సాబ్లె సంతోష్‌సింగ్ డిమాండ్ చేశారు. బుధవారం బీజేపీ పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. నిరుద్యోగులే కేంద్రంగా ఎన్నికలకు వెళ్లి విజయం సాధించిన కాంగ్రెస్ పార్టీ.. అధికారం సాధించాక వారిని పూర్తిగా పక్కకు తోసేసినట్టే కనిపిస్తుందన్నారు. తాము అధికారంలోకి రాగానే ఉద్యోగాలు భర్తీ చేస్తామని జాబ్ క్యాలెండర్ కూడా విడుదల చేసిందని గుర్తు చేశారు. నిరుద్యోగులు ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నారని మాట్లాడిన రేవంత్‌రెడ్డే ఇప్పుడు తమ దగ్గర వేలకు వేలు వసూలు చేయడానికి సిద్ధపడడాన్ని నిరుద్యోగులు జీర్ణించుకోలేక పోతున్నారు. వెంటనే ఫీజులు తగ్గించుకుంటే రేవంత్‌రెడ్డి సర్కారుపై పోరాటం చేస్తామని హెచ్చరించారు.

ఎన్నికల సమరం.. తనిఖీలు ముమ్మరం

● వాహనాలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్న పోలీసులు

సార్వత్రిక ఎన్నికల సమయం దగ్గర పడుతున్న కొద్దీ అధికార యంత్రాంగం తనిఖీలు ముమ్మరం చేస్తుంది. ఎన్నికల్లో మద్యం, డబ్బులు, గంజాయి తదితర వాటిని పూర్తిగా నిర్మూలించేందుకు చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా బుధవారం జైనథ్ మండలం పిప్పర్‌వాడ టోల్‌ప్లాజా వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులో పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. మహారాష్ట్ర నుంచి రాకపోకలు సాగించే వాహనాలు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. వీటితో పాటు ఆదిలాబాద్ జిల్లాలో మరో ఐదు చోట్ల చెక్‌పోస్టులు ఏర్పాటుచేసి తనిఖీలు చేపడుతున్నారు. ఈ తనిఖీల ప్రక్రియను వీడియో చిత్రీకరణ చేపడుతున్నారు.

(ఆంధ్రజ్యోతి, స్టాఫ్ ఫొటోగ్రాఫర్)


పిప్పర్‌వాడ టోల్‌ప్లాజా దగ్గర తనిఖీలు చేస్తున్న పోలీసులు


కలెక్టర్‌కువినతిపత్రం అందిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

జాతీయ జెండా గౌరవాన్ని కాపాడండి

ఆదిలాబాద్‌అర్బన్,మార్చి27 : పట్టణం, గ్రామీణ ప్రాంతాల్లో ఆజాదీకా అమృత్ ఉత్సవ్‌లో భాగంగా హర్‌ఘర్ తిరంగ పిలుపు మేరకు జాతీయ జెండాలను ఎగురవేశారని, కానీ ఇప్పుడు అవి చినిగి పోతున్నాయని బీఆర్ఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు ఇజ్జగిరి నారాయణ అన్నారు. ఇదే విషయమై బుధవారం కలెక్టర్ రాజార్షిషాను కలిసి వినతి పత్రం అందించారు. ఇళ్లపై ఉన్న జెండాలు చినిగి పోతున్నాయని, ఇది జెండాకు అవమాన కారణంగా ఉన్నాయని కలెక్టర్‌కు తెలియజేశారు. వాటిని తొలగించాలని కోరడంతో కలెక్టర్ స్పందించి తొలగించేలా చూస్తామని భరోసా ఇచ్చారని తెలిపారు. 2021లో అమృత్ మహోత్సవ్‌లో భాగంగా హర్‌ఘర్ తిరంగలో జాతీయ జెండాలను ఏర్పాటు చేసి అలాగే వదిలేశారన్నారు. ఇప్పుడు అవి చిరిగి పోతున్నాయన్నారు. జెండా గౌరవాన్ని కాపాడే బాధ్యత ప్రతి ఒక్కరి పై ఉందన్నారు. అదే విధంగా ఆర్‌అండ్‌బీ వద్ద ఏర్పాటు చేసిన భారీ జెండాను కూడా తొలగించారని, దాన్ని వెంటనే ఏర్పాటు చేయాలని కలెక్టర్‌కు విన్నవించడం జరిగిందన్నారు. త్వరలో ఏర్పాటు చేస్తామని భరోసా ఇచ్చినట్లు ఆయన వివరించారు.

మాతాశిశు ఆరోగ్య సంరక్షణ కార్యక్రమాలు చేపట్టాలి : పీవో



ఉట్నూర్,మార్చి27:ఉమ్మడి జిల్లాలోని గిరిజన ప్రాంతాలలో ఉన్న ఏజెన్సీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో మాతా శిశు ఆరోగ్య సంరక్షణ కార్యక్రమాలు నిర్వీరామంగా చేపట్టాలని ఐటీడీ ఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బు గుప్తా అన్నారు. మంగళ వారం రాత్రి ఉట్నూర్ మండల కేంద్రంలోని ఐటీడీఏ పీవో కార్యాలయం చాంబర్‌లో ఉమ్మడి జిల్లాలోని 32 ఏజెన్సీ పీహెచ్‌సీల సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పీఓ ఖుష్బుగుప్తా మాట్లాడుతూ.. ప్రతీ పీహెచ్‌సీలో మాతాశిశు కార్యక్రమాలు, వ్యాధి నిరోధక టీకాలు, ఏఎన్‌సీ చెకప్, వంద శాతం ఇమ్యూనైజేషన్ చేపట్టాలని ఆదేశించారు. అలాగే అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సుఖ ప్రసవాలు నిర్వహించాలన్నారు. ఏజెన్సీ ప్రాంతాలలో గర్భిణులు ప్రసవ సమయంలో మరణించకుండా చూడాలని ఆదేశించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు సమయ పాలన పాటించాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో మందుల కొరత లేకుండా చూసుకోవాలని, అవసరమైన మందులు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఏజెన్సీ అదనపు జిల్లా వైద్యాధికారి డాక్టర్ కుంర బాలు, ఆదిలాబాద్ ఆసిఫాబాద్,మంచిర్యాల డిప్యూటీ డీఎంహెచ్‌వోలు పాల్గొన్నారు.

ఇటుక బట్టీలు తొలగించకపోతే చర్యలు : తహసీల్దార్



ఇచ్చోడ, మార్చి27: ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా నిర్వహిస్తున్న ఇటుక బట్టీలను తొలగించాలని తహసీల్దార్ తుకారాం అన్నారు. బుధవారం మండలంలోని సిరిచెల్మ గ్రామ పరిధిలో అక్రమంగా నిర్వహిస్తున్న ఇటుక బట్టీలను వారం రోజుల్లో తొలగించాలని నిర్వహకులకు సూచించారు. లేని పక్షంలో కఠిన చర్యలు చేపడతామని ఆయన హెచ్చరించారు. ఆయనతో పాటు డిప్యూటీ తహసీల్దార్ రామారావ్ తదితరులు పాల్గొన్నారు.


పిప్పల్‌గావ్‌లో గ్రామస్థుల భాగస్వామ్యంతో నిర్మించిన హనుమాన్ ఆలయం

నెరవేరిన పిప్పల్‌గావ్ చిరకాల కల

- గ్రామస్థుల భాగస్వామ్యంతో హనుమాన్ మందిర నిర్మాణం
- ఈ నెల 30 నుంచి ప్రత్యేక పూజలు
- ఏప్రిల్ ఒకటిన విగ్రహ ప్రతిష్ఠ

జైనథ్, మార్చి 27 : జైనథ్ మండల కేంద్రానికి మూడు కిలో మీటర్ల దూరంలో ఉన్న పిప్పల్‌గావ్ గ్రామస్థులు గత కొన్నేళ్లుగా ఎదురు చూస్తున్న శ్రీరామ హనుమాన్ మందిర నిర్మాణం కల ఎట్టకేలకు నెరవేరింది. చిన్న పల్లెటూరు అయిన పిప్పల్‌గావ్ గ్రామంలో వంద ఇళ్లు ఉంటాయి. వ్యవసాయంపై ఆధారపడే పిప్పల్‌గావ్ ప్రజలు రాజకీయాలకు అతీతంగా గ్రామాన్ని అభివృద్ధి చేసుకుంటారు. ఈ క్రమంలోనే గ్రామస్థుల భాగస్వామ్యంతో గ్రామంలో హనుమాన్ ఆలయ నిర్మాణం పూర్తి అయింది. ఈ నెల 30వ తేదీన నూతనంగా నిర్మించిన హనుమాన్ ఆలయంలో గోపూజ, విఘ్నేశ్వర పుణ్యావరణం, అఖండ దీపారాధనతదితర కార్యక్రమాలతో విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం ప్రారంభం అవుతుంది. ఈ నెల 31వ తేదీన మండల స్థాపిత దేవత నిర్వ పూజలు ఇతర కార్యక్రమాలు నిర్వహించబడతాయి. వచ్చే నెల ఏప్రిల్ 1వ తేదీన గోపాలకృష్ణ పీఠాధిపతి యోగానంద సరస్వతీ ద్వారా హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం ఉంటుంది. ఈ కార్యక్రమానికి ఆదిలాబాద్ నియోజక వర్గంలో ఆయా గ్రామాల ప్రజలు, మహిళలు, భక్తులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని పిప్పల్‌గావ్ గ్రామ ప్రజలు, కోరుతున్నారు.

షీ టీం ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన

ఆదిలాబాద్ అర్బన్, మార్చి27: షీటీం ఆధ్వర్యంలో పట్టణంలోని తాటి గూడ హైస్కూల్ ను సందర్శించి స్కూల్ పిల్లలకు, షీటీం విధులపై సైబర్ క్రైమ్‌పై అవగాహన కల్పించారు. ఎవరైనా పోకిరీలు అమ్మాయిల పట్ల అసభ్యంగా ప్రవర్తించినా, మాట్లాడినా, ఇబ్బందులకు గురిచేసినా, వెంటపడి వేధించినా వెంటనే షీటీంనెంబర్ 8712659953కి ఫోన్‌చేసి ఫిర్యాదు చేయాలని చెప్పారు. చైల్డ్ మ్యారేజ్, గుడ్‌టచ్ బ్యాడ్ టచ్ గురించి వివరించారు. ఇందులో హెచ్ఎం నారాయణ, షీటీం సభ్యులు సుశీల, సత్యమోహన్, ఉపాధ్యాయులు ఉన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న షీ టీం సభ్యులు

'తాగునీటి సమస్యలపై నిర్లక్ష్యం వహించొద్దు'

తలమడుగు, మార్చి27: వేసవి కాలంలో గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని జిల్లాపంచాయతీ అధికారి శ్రీలత కోరారు. బుధవారం మండలంలోని ఖోడద్, తలమడుగు గ్రామ పంచాయతీలను ఆమె అకస్మీకంగా తనిఖీ చేశారు. అనంతరం మండల పరిషత్ కార్యాల యంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో డీపీవో మాట్లాడుతూ వేసవి కాలంలో గ్రామీణ ప్రాంతాల్లో ఎలాంటి తాగు నీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. అదే విధంగా పారిశుధ్య నిర్మాణాలపై ఎప్పటికప్పుడు చర్యలు చేపట్టాలని సూచించారు. ముఖ్యంగా పార్లమెంట్ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున ప్రతీ ఒక్కరు ఎలక్షన్ అధికారి నియమ నిబంధనలు పాటించాలని సూచించారు. అనంతరం మండలంలో చేపట్టిన ఇంటి పన్ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. 28 గ్రామ పంచాయతీలో 95 శాతం పన్ను వసూలు చేసినట్లు చెప్పారు. అలాగే పంచాయతీ అధికారులు అందుబాటులో ఉండి గ్రామాల్లో సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేయాలని సూచించారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

సాధారణ ప్రసవాలు జరిగేలా చర్యలు తీసుకోవాలి

● ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్, మార్చి 27: జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో సాధారణ ప్రసవాలు జరిగేలా అధికారులు, వైద్యులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా వైద్యాధికారి తుకారాం భట్‌తో కలిసి జిల్లా వైద్యాధికారులు, ప్రోగ్రాం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వ హించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోలియోరహిత జిల్లా గా మార్చడంలో భాగంగా జిల్లాలో చేపట్టిన పోలియో కార్యక్రమాన్ని అధికారులు సమన్వయంతో పనిచేసి వందశాతం పూర్తిచేయడం అభినందనీయమన్నారు. ఇదేస్ఫూర్తితో రోగులకు మెరుగైన వైద్యసేవలు అందిం చాలన్నారు. గిరిజన ప్రాంతాల్లో ప్రజలతో మమేకమై స్నేహపూర్వక వాతావరణంలో వైద్యం అందించాలని, అంగన్‌వాడీ, ఆశాకార్యకర్తల సమన్వయంతో వైద్యాధి కారులు గర్భిణులకు అందించే పౌష్టిక ఆహారంతో పాటు మహిళలకు ప్రసవాలపై అవగాహన కల్పించాలన్నారు. సాధారణ ప్రసవాలకు ప్రాధాన్యం ఇచ్చేలా వివరించాలని తెలిపారు. జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలు, ఉప కేంద్రాలు, ప్రభుత్వ ఆసుపతుల పనితీరు, లక్ష్యాలపై అధికారులతో సమీక్షించి తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. జిల్లాలోని దహెగాం మండలం గిన్నెధరి, కౌటాల మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల్లో ప్రతిమంగళవారం మహిళ లకు వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను పంపిణీ చేశామని తెలిపారు. వేసవి కాలం అయినందున గ్రామాల పరిధిలోని ప్రజలకు తాగునీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని తెలిపారు. మార్చి నుంచి జూన్‌వరకు వేసవిలో తాగునీటి సరఫరాలో సమస్యలు లేకుండా ట్యాంకర్లు, బోరువెల్స్, మిషన్ భగీరథ సంబంధిత పైపులైన్ల మరమ్మతులు చేపట్టితాగునీటి కొరతలేకుండా చర్యలు తీసుకో వాలన్నారు.

పిల్లల్లో పోషణ లోపాన్ని పూర్తిగా అరికట్టాలి..


ఆహారాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

పిల్లల్లో పౌష్టికాహార లోపాన్ని పూర్తిగా అరికట్టాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. వారి బంగారు భవిష్యత్‌కు పునాది వేసేది మంచి ఆహారం, విద్య మాత్రమేనని అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆదివాసీ భవన్‌లో జిల్లా స్త్రీశిశుసంక్షేమశాఖ ఆధ్వ ర్యంలో నిర్వహించిన పోషణ్ పక్వాడా కార్యక్రమానికి కలెక్టర్ వెంకటేష్ దోత్రే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అన్న ప్రాసన, అక్షరాభ్యాసం కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం మాట్లాడుతూ పిల్లల్లో0-6 సంవత్సరాల వయస్సు చాలా ముఖ్యమైనదన్నారు. ఆ సమయంలో వారిలో పోషకాహార లోపాన్ని నివారిం చేందుకు అందరూ కలిసికట్టుగా పనిచే యాలని సూచించారు. బాల్యం నుంచే ఆత్మ విశ్వాసం పెరిగేలా ప్రోత్సహించాలన్నారు. పిల్లల ప్రగతికి బాటలు వేయాలంటే వారికి ముఖ్యంగా అందిం చాల్సినది పౌష్టికాహారం, ఆరోగ్యకరమైన అల వాట్లు, విద్య మాత్రమేనని తెలిపారు. పిల్లల్లో పౌష్టికాహార లోపాన్ని వందశాతం అరికట్టాలని అన్నారు. కార్యక్రమంలో డీడబ్ల్యూవో భాస్కర్, సీడీపీవోలు సాదియా, సురేఖ పాల్గొన్నారు.

విద్యుత్‌లైన్ల కింద మంటలు పెట్టవద్దు

ఆసిఫాబాద్, మార్చి27: పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా పరిధిలోని 400 కేవీ విద్యుత్ లైన్ల కింద పంట మిగులును తగులబెట్టవద్ద ని పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఇంజనీర్ గౌతమ్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లైన్ల కింద పంటలు పండిచే రైతులు చేనులో మిగిలిన చెత్తను కాల్చి వేసే క్రమంలో మంటలు చెలరేగి ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుందన్నారు. జంతువులు, మనుషులకు హానిజరిగే అవకాశం ఉంటుందన్నారు. రైతులు గమనించి విద్యుత్‌లైన్ల కింద మంటలు పెట్టవద్దన్నారు.

ప్రారంభం కానున్న ఫ్లైఓవర్ పనులు

సిర్పూర్(టి), మార్చి27: మండలంలోని వేంపల్లి సమీపంలోని రైల్వేగేటు వద్ద నిలిచిపోయిన ఫ్లైఓవర్ పనులు ప్రారంభం కానున్నాయి. ట్రాక్‌పై పై ఓవర్ ప్లేట్లు అమర్చేందుకు ఇంజనీరింగ్ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇప్పటికే అధికారులు భారీ యంత్రాలను సిద్ధంగా ఉంచారు. నేడోరేపో పనులు ప్రారంభం కానున్నట్లు తెలుస్తోంది.

31 వరకు గడువు పొడిగింపు

సిర్పూర్(టి), మార్చి 27: సాంఘిక సంక్షేమ గురుకుల సొసైటీ, గిరిజన సంక్షేమ సొసైటీ ఆధ్వర్యంలో నడుస్తున్న పాఠశాలల్లో 6, 7, 8, 9 తరగతుల్లో ఖాళీగా ఉన్న బ్యాక్లాగ్ సీట్ల భర్తీకి గడువుతేదీని ఈనెల31 వరకు పొడగించినట్లు డీసీవో బాల రాజు ఒకప్రకటనలో తెలిపారు.

గిరిజన విద్యార్థికి కరెంట్‌షాక్, రిమ్స్‌లో చికిత్స

ఉట్నూర్, మార్చి27: ఉట్నూర్ మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాల మూడవ తరగతి విద్యార్థి టేకం మాణిక్‌రావు కరెంట్‌షాక్‌కు గురికావడంతో జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కు తరలించి వైద్య సేవలు అందించామని జిల్లా గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ దిలీప్ కుమార్ తెలిపారు. బుధవారం ఉదయం ఇద్దరు విద్యార్థులు బాల్ ఆడుతు ండగా మాణిక్‌రావు కరెంట్ వైర్లకు తగిలి షాక్‌కు గురికావడంతో ప్రథమ చికిత్సల అనంతరం జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కు తరలించి సత్వర వైద్యం అందించడంతో విద్యార్థి ఆరోగ్యం మెరుగు పడిందని విద్యార్థికి ఎలాంటి ప్రమాదం లేదని వివరించారు.

ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

ఆసిఫాబాద్, మార్చి 27: జిల్లాషెడ్యూల్డ్ కులాల అభివృద్ధిశాఖ ఆధ్వర్యంలో గ్రూప్-1, 2, 3, 4, ఎస్ఎస్‌సీ, ఆర్ఆర్‌బీ, బ్యాంకింగ్, ఎస్సై, కానిస్టేబుల్ తదితర రాష్ట్ర, కేంద్రస్థాయి ఉద్యోగాల కోసం మూడు నెలల పాటు ఉచితశిక్షణ ఇస్తామని జిల్లాషెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖాధికారి సజీవన్ ఒకప్రకటనలో తెలిపారు. ఈనెల28 వరకు కాగజ్‌నగర్ పట్టణంలోని సాయితేజ డిగ్రీ కళాశాలలో స్పాట్ అడ్మిషన్ ద్వారా ఎంపికతో పాటు అభ్యర్థులకు డిగ్రీలో వచ్చిన మార్కుల ఆధారంగా సీట్లు కేటాయిస్తామని తెలిపారు. ఇతర వివరాలకు వసతిగృహ సంక్షేమాధికారులు దేవాజీ (99852 74060), డి.చందన (824729 9217)ను సంప్రదించాలని పేర్కొన్నారు.

ఆదిలాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి ఆత్రం సుగుణ

● ప్రకటించిన అధిష్ఠానం



ఆదిలాబాద్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ఎట్టకేలకు కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థిగా ఆదివాసీ ఉపాధ్యాయురాలు, మహిళా నేత ఆత్రం సుగుణ పేరును ఖరారు చేస్తూ పార్టీ అధిష్ఠానం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ బుధవారం రాత్రి అధికారిక ప్రకటన విడుదల చేసింది. దీంతో కాంగ్రెస్‌లో నెలకొన్న ఉత్కంఠకు తెర పడినట్లయ్యింది. ఇప్పటికే బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు తమ అభ్యర్థులను ప్రకటించగా.. కాంగ్రెస్ పార్టీ కొంత ఆలస్యంగా ఆదివాసీ మహిళా అభ్యర్థిని లోక్‌సభ ఎన్నికల బరిలోకి దింపేందుకు సిద్ధమైంది. ముందు నుంచి ఎంపీ అభ్యర్థిగా ఖానాపూర్ మాజీ ఎమ్మెల్యే దంపతులు రేఖా శ్యాంనాయక్ తోపాటు డాక్టర్ సుమలత, ఆత్రం భాస్కర్, ఖానాపూర్ సిట్టింగ్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పేర్లు ప్రధానంగా వినిపించాయి. కానీ చివరకు ఆదివాసీ మహిళ ఆత్రం సుగుణ పార్టీ అధిష్ఠానం మొగ్గు చూపింది. వారం రోజుల క్రితమే ఆత్రం సుగుణ ఉపాధ్యాయ ఉద్యోగానికి రాజీనామా చేసి.. ఆ మరుసటి రోజే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. దీంతో అందరి అంచనాలు తారుమారయ్యాయి. ఆత్రం సుగుణనే కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి అన్న ప్రచారం జోరుగా సాగింది. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలకు భిన్నంగా కాంగ్రెస్ పార్టీ ఓ మహిళా నేతను లోక్‌సభ ఎన్నికల బరిలోకి దించడం ఆసక్తికరంగా మారింది. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా ఆత్రం సుగుణ ప్రకటన పట్ల కాంగ్రెస్ పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అయితే ఆత్రం సుగుణ ఎస్టీ పేరుకు బదులు కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం ఆత్రం సుగుణ చెలిమెల (ఎస్సీ) అంటూ జాబితాలో పేర్కొనడం కొంత గందరగోళ పరిస్థితులకు దారి తీసింది.



సమావేశంలో మాట్లాడుతున్న ఆదిలాబాద్ కలెక్టర్ రాజార్షిషా


సమావేశంలో పాల్గొన్న అధికారులు

అధికారులు బాధ్యతతో పని చేయాలి: కలెక్టర్

ఆదిలాబాద్ అర్బన్, మార్చి 27: ఎన్నికల విధులను అధికారులు బాధ్యతతో చేయాలని కలెక్టర్ రాజార్షిషా సూచించారు. ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజక వర్గ పరిధిలోని ఆదిలాబాద్, బోథ్, నిర్మల్, ముథోల్, ఖానాపూర్, ఆసిఫాబాద్, సిర్పూర్‌టి అసెంబ్లీ సెగ్మెంట్ల పరిధిలోని ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా జనరల్ ఎలక్షన్ లోక్‌సభ 2024 ఎన్నికలకు సంబంధించి జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో కో ఆర్డినేషన్ సమావేశం ఆదిలాబాద్ కలెక్టర్ రాజార్షిషా ఏఆర్ఓఎస్, ఎస్‌డీపీవోలతో బుధవారం నిర్వహించారు. ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో మొత్తం పోలింగ్ కేంద్రాలు 2111 ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బ్యాలెట్ యూనిట్స్ 2638 కంట్రోల్ యూనిట్స్ 2638 వీవీ ప్యాట్స్ 2908 మొబైల్ కనెక్టివిటీ20399, షాడో పోలింగ్ కేంద్రాలు సిర్పూర్ 11, ఆసిఫాబాద్ 28, ఖానాపూర్ 9, ఆదిలాబాద్ 9, బోథ్ 14, నిర్మల్ 1 మొత్తం కలిపి 72 ఉన్నాయన్నారు. జిల్లాలో జరిగే పార్లమెంట్ ఎన్నికలను స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్వహించేందుకు ఎన్నికల విధులు నిర్వహించే అధికారులు బాధ్యతతో పని చేయాలని, వారికి సంబంధించిన అంశాల పై పూర్తి అవగాహన కలిగి ఉండాలని ఏఆర్ఓఎస్‌ను ఆదేశించారు. పోలింగ్ విధుల కోసం నియమించిన సిబ్బందికి ఏప్రిల్ 3, 4 తేదీలలో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. శిక్షణతోపాటు ఫామ్ 12డీ కౌంటర్‌ఏర్పాటు



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ గౌస్ ఆలం

చేయాలని, ఎన్నికల విధుల్లో ఉన్న ప్రతీఒక్కరు ఫారం 12 డి ఉపయోగించుకోవాలన్నారు. ఏఆర్ఓఎస్ పోలింగ్‌కు ముందే అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని, ప్రతిది దగ్గరుండి పర్యవేక్షించాలని, ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని తెలిపారు. కౌంటింగ్ కేంద్రాలలో సివిల్ వర్క్స్ ఏమైనా ఉంటే కంప్లీట్ చేయాలని, స్ట్రాంగ్ రూమ్, టేబుల్స్, బందోబస్తు తదితర ఏర్పాట్లు ముందుగానే పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే సెక్టారల్ అధికారులకు టీం వైస్‌గా శిక్షణ ఇవ్వాలని, ఎంటర్ స్టేట్ సమ స్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద గట్టి నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు. అనంతరం జిల్లా ఎస్పీ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఆరు అంతరాష్ట్ర చెక్‌పోస్టులు రెండు అంతర్ జిల్లా చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి నిరంతరం తనిఖీ నిర్వహించడం జరుగుతుందని, అదే విధంగా ప్రజల లో ఓటు హక్కును వినియోగించుకునే విధంగా ఫ్లాగ్ మార్చ్‌లు నిర్వహిస్తూ ప్రజలకు అవగాహన కల్పిస్తూ చైతన్య పరచడం జరుగుతు ందన్నారు. ఎటువంటి సిగ్నల్ వ్యవస్థ లేనటువంటి షాడో పోలింగ్ స్టేషన్ ప్రాంతాలను గుర్తించి కమ్యూనికేషన్ వ్యవస్థను పటిష్ఠం చేసేలా వీహెచ్ఎఫ్ సెట్లను ఉపయోగించాలని సూచించారు. కౌంటింగ్ సెంటర్లో, స్ట్రాంగ్ రూములలో మూడంచెల భద్రత ఏర్పాటు చేయాలని సూచించారు. ఇతర రాష్ట్రాల పోలీసు సిబ్బందితో సమన్వయం కోసం ఇంటర్ స్టేట్ బోర్డింగ్ జిల్లాలతో మీటింగ్‌లను నిర్వహించామన్నారు. బోర్డర్‌లో ఉన్న పోలీసు అప్రమత్తంగా ఉండేలా సమాచార వ్యవస్థను పటిష్ఠం పర్చినట్లు తెలిపారు. సమా వేశంలో ఐటీడీఏ పీవో ఖుష్బుగుప్తా, ఆసిఫాబాద్, అదనపుకలెక్టర్ దీపక్ తివారి, ట్రైని కలెక్టర్‌వికాస్ మహతో, నిర్మల్ అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, ఆదిలాబాద్ అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ఆదిలాబాద్, నిర్మల్, కొమురంభీం ఆసిఫాబాద్, ఏఎస్‌డీ ఎస్పీ, డీఎస్పీ, ఆర్డీఓలు ఎన్నికల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రైలు కిందపడి యువతీ యువకుడి ఆత్మహత్య

బాసర, మార్చి27: బాసర రైల్వేస్టేషన్‌లో బుధవారం యువతీ యువకుడు రైలు కింద పడి ఆత్మహత్య పాల్పడ్డారు. రాత్రి 8 గంటల ప్రాంతంలో నాగర్‌సోల్ నుంచి నర్సాపూర్ వెళ్లే రైలు బాసర స్టేషన్‌కు రాగా.. ఆ రైలు పట్టాల కింద పడి ఇద్దరు ఆత్మహత్య చేసుకున్నట్లు స్థానికులు తెలిపారు. యువతి మృతదేహం వద్ద నిజామాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన నిషిత కాలేజీకి చెందిన ఐడీ కార్డును పోలీసులు గుర్తించారు. ప్రేమ వ్యవహారమే వీరి ఆత్మహత్యకు కారణమై ఉండవచ్చునని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈఘటనపై నిజామాబాద్ రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మున్సిపాలిటీ అభివృద్ధికి పటిష్ఠ చర్యలు

● వరంగల్ రీజనల్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ షాహిద్ మసూద్


మాట్లాడుతున్న షాహిద్ మసూద్

ఆసిఫాబాద్‌రూరల్, మార్చి 27: నూతనంగా ఏర్పడిన ఆసిఫాబాద్ మున్సి పాలిటీ అభివృద్ధికి అధికారులు, ప్రజల సమన్వయం తో పటిష్ఠచర్యలు తీసుకోనున్నట్లు వరంగల్ రీజనల్‌ఆఫ్‌మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ షాహీద్ మసూద్ తెలిపారు. బుధవారం మున్సిపల్ కమిషనర్ భుజంగ్‌రావుతో కలిసి కార్యాలయాన్ని పరిశీలించారు. కార్యాలయంలోని రికార్డులను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మున్సిపాలిటీ అభివృద్ధి విషయంలో అవకతవకలు తనదృష్టికి వస్తే తప్పకుండా సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకుంటామన్నారు. నూతన మున్సిపల్ కార్యాలయం ఏర్పాటుపై జిల్లా ఉన్నతాధికారులకు వివరించామన్నారు. స్థానికప్రజల సహకా రంతో అభివృద్ధి పనులకు ప్రణాళికలు రూపొందిస్తామన్నారు. ఆయనవెంట డీఈ మసూద్‌అలీ, సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైన విద్యార్థి

ఆసిఫాబాద్‌రూరల్, మార్చి27: ఆసిఫాబాద్ పట్టణంలోని గిరిజన ఆదర్శ క్రీడా పాఠశాలలో ఏడవ తరగతి చదువుతున్న నాగేశ్వరి గురువారం నుంచి ఏప్రిల్2 వరకు ఢిల్లీలో జరుగ నున్న జాతీయస్థాయి ఖోఖోపోటీలకు ఎంపికై నట్లు క్రీడాధికారి బండ మీనారెడ్డి, హెచ్ఎం కృష్ణరావు తెలిపారు. గత ఫిబ్రవరిలో యాదాద్రి భువన గిరిలో జరిగిన 56వ రాష్ట్రస్థాయి ఖోఖో చాంపియ న్‌షిప్ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచింది. ఈనెల16నుంచి 25వరకు రంగా రెడ్డి జిల్లా పరిగిలో జరిగిన శిక్షణ శిబిరంలో పాల్గొని తెలంగాణ జట్టు తరఫున జాతీయస్థాయి పోటీలకు ఎంపికైంది. ఐటీడీఏ పీవో కుష్బు గుప్తా, డీడీ రమాదేవి, ఏసీఎంవో ఉద్ధవ్, ఏటీడీవో క్షేత్రయ్య, జీసీడీవో శకుంతల, ఉపాధ్యాయులు విద్యార్థి ఎంపిక పట్ల అభినందనలు తెలిపారు.


వాంకిడిలో పట్టుకున్న నగదుతో పోలీసులు

తనిఖీల్లో నగదు పట్టివేత

వాంకిడి, మార్చి 27: మండలంలోని పోలీస్‌స్టేషన్‌వద్ద బుధవారం వాహ నాల తనిఖీల్లో భాగంగా సరైన ఆధారాలు లేకుండా తరలిస్తున్న రూ.1.30లక్షల పట్టుకున్నట్లు ఎస్సైసాగర్ తెలిపారు. మహారాష్ట్రకు చెందిన రాంబారే చంద్రమడ్ తనకారులో హైదరాబాద్‌కు వెళ్తుండగా రూ.1.30లక్షలు పట్టుకున్నట్లు వివరిం చారు. సరైన ఆధారాలు లేకపోవడంతో నగదును సీజ్‌చేసినట్లు ఎస్సై తెలిపారు. తనిఖీల్లో ఏఎస్సై పోశెట్టి, ఉల్లాస్ పాల్గొన్నారు.

సిర్పూర్(టి): మండలంలోని వెంకట్రావుపేటవద్ద ఏర్పాటుచేసిన చెక్‌పోస్టు వద్ద లక్షరూపాయలు పట్టుకున్నట్లు ఎస్సై దీకొండ రమేష్ తెలిపారు. మహ బూబాబాద్‌కు చెందిన రాందాస్ కారులో లక్షరూపాయలతో మహారాష్ట్రకు వెళ్తుండగా వాహనాలతనిఖీల్లో భాగంగా పట్టుకున్నట్లు తెలిపారు.

'ఇష్టారాజ్యంగా పనులు చేపడితే ఊరుకునేది లేదు'


పనులను పరిశీలిస్తున్న జడ్పీటీసీ

వాంకిడి, మార్చి 27: మండలంలోని జాతీయ రహదారి నుంచి కనర్‌గాం మీదుగా కాగజ్‌నగర్ వరకు నిర్మిస్తున్న బీటీ రోడ్డు పనులను కాంట్రాక్టర్ ఇష్టారాజ్యంగా నిర్మిస్తే ఊర్కొనేది లేదని జడ్పీటీసీ అజయ్‌కుమార్ హెచ్చరించారు. బుధవారం రోడ్డు, వంతెన నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఇంజనీరింగ్ అధికారుల పర్యవేక్షణ లేకపోవడం వల్ల ఇష్టారాజ్యంగా రోడ్డు నిర్మాణపనులు చేపడు తున్నారని ఆయన పేర్కొన్నారు. అనంతరం ఆర్అం డ్‌బీ ఈఈకి ఫిర్యాదు చేశారు. పనుల్లో నాణ్యత లోపించకుండా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో ఆందోళన చేపడుతామన్నారు.

ఆశ్రమపాఠశాల హెచ్‌ఎం సస్పెన్షన్

జైనూర్, మార్చి 27: మండలంలోని పట్నాపూర్ ఆశ్రమపాఠశాల హెచ్‌ఎం జాదవ్ పర్శరాంను సస్పెన్షన్ చేసినట్లు గిరిజన సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ రమాదేవి బుధవారం తెలిపారు. పాఠశాల నుంచి బియ్యం అక్రమ రవాణా వ్యవహారంపై పూర్తి విచారణ జరిపి నివేదికను ఐటీడీఏ పీవో ఖుష్బు గుప్తకు సమర్పించగా ఆమె సస్పెండ్ చేశారన్నారు. ఈ మేరకు హెచ్‌ఎం పర్శరాంకు సస్పెన్షన్ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయన్నారు.



కనీస పింఛన్ రూ.15వేలు ఇవ్వాలి

శ్రీరాంపూర్, మార్చి 27: సింగరేణి రిటైర్డ్ కార్మికులకు కనీసపింఛన్ రూ.15వేలు ఇవ్వాలని సింగరేణి రిటైర్డ్ ఆఫీసర్స్ అసోసియేషన్, కోల్ పెన్షనర్స్ అసోసియేషన్, సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు కోరారు. కనీస వేతన సలహా మండలి చైర్మన్, ఐఎన్‌టీయూసీ సెక్రెటరీ జనరల్ బి జనక్‌ప్రసాద్‌ను బుధవారం హైదరాబాద్‌లో సన్మానించి పలు సమస్యలు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. కోల్ పెన్షన్-1998 చట్టాన్ని సవరించి కనీస పింఛన్‌ను రూ.15 వేలుగా నిర్ణయించాలన్నారు. ప్రతి మూడేళ్లకు ఒకసారి కరువు భత్యంతో కూడిన పింఛన్ ఇవ్వాలన్నారు. ఆయా సమస్యలను ముఖ్యమంత్రి, సింగరేణి సీఎండీ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని జనక్‌ప్రసాద్ పెన్షనర్స్‌కు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సింగరేణి రిటైర్డ్ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కె వాసుదేవ్‌రావు, ఎ బుచ్చిప్రసాద్, కోల్ పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కేఆర్‌సీ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రమాద రహిత గనులుగా తీర్చిదిద్దాలి

కాసిపేట, మార్చి 27: సింగరేణిలో ప్రమాదరహిత గనులుగా తీర్చిదిద్దడంలో కార్మికులు అధికారులు భాగస్వాములు కావాలని మందమర్రి ఏరియా రక్షణాధికారి రవీందర్ అన్నారు. బుధవారం మందమర్రి డివిజన్ పరిధిలోని కాసిపేట2వ గనిపైనిర్వహించిన రక్షణ సూత్రాల అవగాహన కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. సింగరేణిలో ప్రమాదాల నివార ణకు ప్రతిఒక్కరు బాధ్యతగా రక్షణ సూత్రాలను పాటించాలన్నారు. కార్యక్రమంలో కేకే గ్రూపుఏజెంటు రాందాస్, గనిమేనేజర్ లక్ష్మీనారాయణ, అధికారులు, కార్మికులు పాల్గొన్నారు.

రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించాలి

శ్రీరాంపూర్/జైపూర్, మార్చి 27: రక్షణతో కూడిన బొగ్గు ఉత్పత్తిని సాధించాలని సింగరేణి డైరెక్టర్(ప్రాజెక్ట్స్ అండ్ ప్లానింగ్) జి వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే7గని, శ్రీరాంపూర్, జైపూర్‌లోని ఓసీపీలను జనరల్‌మేనేజర్ బి సంజీవ రెడ్డితో కలిసి సందర్శించారు. ఈ ఆర్థిక సంవత్సరం ముగింపునకు నాలుగు రోజుల గడువే ఉందని, ఉద్యోగులు నిర్దేశిత బొగ్గు ఉత్పత్తిని సాధించాలని ఆదేశించారు. శ్రీరాంపూర్ ఓసీపీలో ఓబీ వెలికితీతపై ప్రైవేటుకాంట్రాక్టు కంపెనీలతో మాటాడారు. ఆర్కే7గనిలోనికి దిగి పనిప్రదేశాలలో ఉద్యోగులతో మాట్లాడారు. తప్పనిసరిగా రక్షణ పరికరాలు ధరించాలని, రక్షణ సూత్రాలు పాటించాలని సూచించారు. ఉన్నతాధికారుల సూచనల మేరకు పనులు కొనసాగించాలన్నారు. కార్యక్రమాలలో ఎస్‌వోటు జీఎం వి పురుషోత్తమరెడ్డి, ఏరియా ఇంజనీర్ చంద్రశేఖర్ రెడ్డి, ఓసీపీ పీవో టి శ్రీనివాస్, మేనేజర్ బ్రహ్మాజీరావు, ఆర్కే 7 గ్రూపు ఇన్‌చార్జి ఏజెంట్ ఏవీ రెడ్డి, గని మేనేజర్ శ్రీధర్, క్వాలిటీమేనేజర్ వెంకటేశ్వర్ రెడ్డి, సర్వే అధికారి సంపత్, ఎస్ఎస్‌వో మురళీమోహన్, తదితరులు, జైపూర్‌లో జరిగిన కార్యక్రమంలో గని ప్రాజెక్టు అధికారి శ్రీనివాస్, గ్రూప్‌మేనేజర్ వెంకటేశ్వర్లు, గని మేనేజర్‌రవికుమార్, ఇంజనీర్ రమేష్, ఏరియా సెక్యూరిటీ అధికారి మురళీమోహన్ తదితరులు పాల్గొన్నారు.


ఇందారం ఓసీపీని పరిశీలిస్తున్న డైరెక్టర్ వెంకటేశ్వర్‌రెడ్డి

కార్మిక సమస్యలు పరిష్కరిస్తాం

శ్రీరాంపూర్, మార్చి 27: కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఉంటేనే కార్మికులసమస్యలు పరిష్కారమవుతాయని ఆపార్టీ పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి గోమాసశ్రీనివాస్ అన్నారు. బీజేపీజిల్లా అధ్యక్షుడు వి రఘునాథ్‌తో కలిసి ఆయన బుధవారం ఉదయం మొదటిషిఫ్ట్‌లో కార్మికులను కలిసి ఓట్లు అభ్యర్థించారు. పెద్దపల్లి పార్లమెంట్‌స్థానం నుంచి పోటీచేస్తున్న తనను భారీమెజార్టీతో గెలిపించాలని కార్మికులను కోరారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణాధ్యక్షుడు సత్రం రమేష్, ఇన్‌చార్జి కమలాకర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

మంత్రులను కలవనున్న ఐఎన్‌టీయూసీ నాయకులు

శ్రీరాంపూర్, మార్చి 27: సింగరేణివ్యాప్తంగా నెలకొన్న సమస్యల పరిష్కారానికి గురువారం రాష్ట్రమంత్రులను కలువనున్నట్లు ఐఎన్‌టీయూసీ ఏరియా ఉపాధ్యక్షుడు జె.శంకర్‌రావు తెలిపారు. బుధవారం నస్పూర్-శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణిలోని 11ఏరియాలకు చెందిన యూనియన్ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లనున్నట్లు చెప్పారు. పెర్క్స్‌పై ఆదాయపు పన్నుమినహాయించాలని, డిపెండెంట్ల వయస్సును 35ఏళ్లనుంచి 40 ఏళ్లకు పెంచాలని, తదితర సమస్యలను మంత్రులు భట్టి విక్రమార్క, శ్రీధర్‌బాబు, పొంగులేటిని కలిసి విన్నవిస్తామన్నామన్నారు. అన్ని ఏరియాలకు చెందిన నాయకులకు యూనియన్ సెక్రెటరీ జనరల్ జనక్‌ప్రసాద్ నాయకత్వం వహిస్తారని పేర్కొన్నారు. నాయకులు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో గరిగె స్వామి, సీహెచ్ భీంరావు, కలవేన శ్యామ్, తదితరులు పాల్గొన్నారు.

అడెల్లి ఆలయ హుండీ లెక్కింపు పూర్తి

సారంగాపూర్, మార్చి 27: మండలంలో మహాప్రసిద్ధి గాంచిన అడెల్లి మహా పోచమ్మ హుండీ లెక్కింపు బుధవారం నిర్వహించారు. ఈ హుండీ లెక్కింపులో నగదు రూ. 28లక్షల 33వేల 457, బంగారం 178 గ్రాములు, వెండి 3కిలోల 430 గ్రాములు వచ్చినట్లు ఆలయ ఇన్‌చార్జి ఈవో రంగు రవికిషన్‌గౌడ్ తెలి పారు. ఈ హుండీ లెక్కింపు కార్యక్రమంలో జడ్పీటీసీ పత్తిరెడ్డి రాజేశ్వర్ రెడ్డి, నాయకులు దశరథ్ రాజేశ్వర్, భోజా గౌడ్‌లతో పాటు ఆలయ సిబ్బంది, మహిళా భక్తులు ఉన్నారు.


● ఏ క్షణంలో అయినా కూలిపోయేలా ఉన్న తరగతి గదిలోని పైకప్పు

- క్యాంపస్‌లో అసౌకర్యాలతో విద్యార్థుల అవస్థలు
- మరమ్మతులకు నోచుకోని మౌలిక వసతులు
- విద్యాసంవత్సరం పూర్తవుతున్నా ఇంకా అందని యూనిఫామ్స్
- అందుబాటులోకి రాని కంప్యూటర్ ల్యాబ్
- అరకొర వసతుల మధ్య విద్యార్థుల విద్యాభ్యాసం
- అసెంబ్లీ దృష్టికి వెళ్లినా.. ఫలితం శూన్యం


నిర్వహణ సరిగా లేక వినియోగం లేని మరుగుదొడ్డి




యూనిఫామ్స్ ఇవ్వకపోవడంతో సివిల్ డ్రెస్‌లోనే తరగతులకు హాజరవుతున్న విద్యార్థులు

ట్రిపుల్ ఐటీలో..
సమస్యల తిష్ఠ!

బాసర, మార్చి 27: రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలేడ్జ్ టెక్నాలజీ (ఆర్జీయూకేటీ) బాసర ట్రిపుల్ ఐటీలో సమస్యలు తిష్ఠ వేశాయి. నెలలు, సంవత్సరాలు గడుస్తున్నా విద్యార్థుల సమస్యలకు పరిష్కారం లభించడం లేదు. కనీసం మౌలిక సదుపాయాలు లేక నిత్యం విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇటు హాస్టల్ గదులు, అటువైపు తరగతి గదులు మరమ్మతులకు నోచుకోక అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఇదిలా ఉంటే విద్యాభ్యాసానికి అవసరమైన సౌకర్యాలు లేక ట్రిపుల్ ఐటీలో విద్యార్థుల చదువు ప్రశ్నార్థకంగా మారింది. విద్యాసంవత్సరం ప్రారంభమై మరో రెండు, మూడువారాల్లో ముగియనున్నప్పటికీ ఇప్పటివరకు విద్యార్థులకు కనీసం యూనిఫామ్స్ అందివ్వలేదంటే ఇక్కడ విద్యార్థుల పరిస్థితి ఏమిటో అర్థం చేసుకోవచ్చు. కంప్యూటర్ ల్యాబ్‌లు ఏర్పాటు చేయకపోవడంతో తరగతులు జరుగుతున్నా కంప్యూటర్‌పై ప్రాక్టికల్ క్లాసులు మాత్రం విద్యార్థులు నిర్వహించుకోలేకపోతున్నారు. సమస్యల కోసం రెండేళ్ల కిందట వారం రోజులపాటు ఎండ, వాన, పగలు రాత్రి అని లెక్క చేయకుండా శాంతియుతంగా ఉద్యమం చేసినప్పటికీ అధికారుల్లో మాత్రం చలనం లేదు. సమస్యలను పట్టించుకునే నాథుడు లేడు. ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్‌కు ట్రిపుల్ ఐటీ ఇన్‌చార్జీ వీసీగా అదనపు బాధ్యతలు అప్పజెప్పడంతో ఆయన పూర్తి స్థాయిలో సమయం కేటాయించలేకపోతున్నారు. ఫలితం ట్రిపుల్ ఐటీ విద్యార్థుల సమస్యలు నెలల తరబడి పరిష్కారానికి నోచుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. ఉన్న రెగ్యులర్ డైరెక్టర్ నెల కిందట వెళ్లిపోవడంతో డైరెక్టర్‌తో పాటు పరిపాలనాధికారి ఇతర ఉన్నతస్థాయి పోస్టులన్నీ ఖాళీగా ఉన్నాయి. అధ్యాపకులకు పరిపాలనకు సంబంధించి అదనపు బాధ్యతలు అప్పగించి ఉన్నతాధికారులు చేతులు దులుపుకుంటున్నారు. సుమారు 9వేల మంది విద్యార్థులున్నా క్యాంపస్ పరిపాలన గాలిలో దీపంలా కన్పిస్తోంది.

నేటికీ అందని యూనిఫామ్స్

గతేడాది జూలై నెలలో 1500 మంది విద్యార్థులు కొత్తగా ప్రవేశం పొందారు. వీరికి ఒకటి, రెండు నెలల్లో యూనిఫామ్స్ ప్రభుత్వం నుంచి ఇంటర్మీడియట్ బుక్స్ అధికారులు అందివ్వాలి. వీటితోపాటు హాస్టల్‌లో అవసరమైన ఇతర దుస్తులు, స్పోర్ట్స్ యూనిఫామ్స్, బెడ్‌షీట్‌లు వంటివి అధికారులు సమకూర్చాలి. ప్రకటనలు తప్ప అధికారులు ఇప్పటివరకు విద్యార్థులకు కావాల్సిన వస్తు సామగ్రిని అందివ్వలేదు. మరో రెండు, మూడువారాల్లో విద్యా సంవత్సరం ముగియనుంది. సాధారణ దుస్తుల్లోనే విద్యార్థులు తరగతులకు హాజరవుతున్నారు.

అసౌకర్యాలతో నిత్య సహవాసం

హాస్టల్ గదుల్లో అనేక సమస్యలు విద్యార్థులు ఎదుర్కొంటున్నారు. వసతి గృహాలు ఏర్పాటు చేసి దాదాపు 10-12 సంవత్సరాలు గడుస్తోంది. బాత్‌రూమ్‌లు, బస చేసే గదులు, కిటికీలు వంటివి పూర్తిగా చెడిపోయి మరమ్మతులు చేయాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. విద్యార్థులు అనేకసార్లు అధికారులకు విన్నవించినా ఫలితం లేదు. తలుపులు లేకున్నా బాత్‌రూమ్‌లను వినియోగించుకుంటున్నట్లు విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమస్యలు బయటకు చెప్పుకుంటే అధికారులు టార్గెట్ చేసి కక్షసాధింపు చర్యలు చేపడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఫలితంగా విద్యార్థులు ఎన్ని సమస్యలు ఎదురైన మౌనంగా భరిస్తున్నారు. ఏడాది క్రిందట ఒక విద్యార్థి హాస్టల్ గదిలో పైకప్పు కూలి తలకు తీవ్రగాయాలు చోటుచేసుకున్న ఘటనలు ఉన్నాయి. ఇటీవలే ఎమ్మెల్యే రామారావు పటేల్ యూనివర్సిటీలో పర్యటించి విద్యార్థుల సమస్యలను చూసి చలించిపోయారు. కనీస సౌకర్యాలు లేవని ఆవేదన వ్యక్తం చేశారు.


తనిఖీ చేస్తున్న ఎమ్మెల్యే రామారావు పటేల్ (ఫైల్)

అసెంబ్లీలో ప్రస్తావించినా ఫలితం శూన్యం

ఇటీవలి అసెంబ్లీ సమావేశాల్లో బాసర ట్రిపుల్ ఐటీ సమస్యలపై ఎమ్మెల్యే రామారావు పటేల్ ప్రస్తావించారు. ప్రతీ సమస్యను అసెంబ్లీ వేదికగా ప్రభుత్వ దృష్టికి తెచ్చారు. విద్యార్థుల పరిస్థితి ఘోరంగా ఉందని ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. సెమిస్టర్ విధానం తీసివేయడం వల్ల విద్యార్థులు తీవ్ర ఒత్తిడి ఎదుర్కొని ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని చెప్పారు. హాస్టళ్లు, తరగతి గదులు, అధ్యాపకుల కొరత వంటి సమస్యల గురించి ప్రస్తావించారు.

నిధులు పక్కదారి..?

ఏడాది కాలంగా యూనివర్సిటీకి రూ. 80 కోట్లు నిధులు వచ్చినట్లు యూనివర్సిటీ అధికారులు పదే పదే చెబుతున్నారు. వీటితో పాటు యూనివర్సిటీ ఫిక్స్‌డిపాజిట్‌ల నుంచి రూ.కోట్ల నిధులు వివిధ అవసరాలకు వెచ్చిస్తున్నారు. ఇన్ని కోట్లు కరుగుతున్నా విద్యార్థులకు మాత్రం వసతులు మెరుగుపడకపోవడంపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వసతి గృహాలకు పెయింటింగ్, మరమ్మతులు, కొత్త కిచెన్ మరమ్మతు పనుల పేరిట పెద్ద ఎత్తున నిధులు పక్కదారి పట్టాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అవసరం లేని, అప్రాధాన్యత పనులను చేపట్టి రూ.కోట్ల నిధులు దుర్వినియోగం చేస్తున్నారనే విమర్శలున్నాయి.


మృతదేహంతో ఆందోళన చేస్తున్న మృతుడి బంధువులు

వైన్స్‌లో వ్యక్తి అనుమానాస్పద మృతి

● మృతదేహంతో కుటుంబీకుల ఆందోళన
● వైన్‌షాప్‌లోని సీసీ టీవీ ఫుటేజీ మాయంపై నిలదీత

లోకేశ్వరం, మార్చి 27: మద్యం తాగి ఓ వ్యక్తి వైన్స్‌లో అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. దీంతో మృతుడి కుటుంబీకులు బుధవారం మృతదేహంతో ఆందోళనకు చేపట్టారు. మండల కేంద్రానికి చెందిన పోతరాజు ప్రశాంత్ ఓ వైన్‌షాప్‌లో మంగళవారం మద్యం తాగేందుకు వెళ్లగా.. అక్కడ ఎవరో ఆయనను హత్య చేశారని, మృతిపై అనుమానాలు ఉన్నాయంటూ మృతుడి బంధువులు, గ్రామస్థులు బుధవారం మృతదేహంతో వైన్స్ ఎదుట ఆందోళనకు దిగారు. మృతుడు ప్రశాంత్ మంగళవారం ఉదయం 11గంటలకు వైన్స్‌లోకి వెళ్లి సాయంత్రం 4గంటల ప్రాంతంలో మృతి చెందినట్లు బంధువులు చెప్తున్నారు. మృతుడి ముక్కులో నుంచి రక్తం వచ్చిన ఆనవాళ్లు ఉన్నాయని, సీసీ ఫుటేజ్‌లో ఉదయం 10నుంచి సాయంత్రం 6గంటల వరకు వివరాలు లేవని వైన్‌షాప్ సిబ్బంది చెప్పడంతో మండిపడ్డారు. అలాగే ప్రశాంత్ మృతదేహాన్ని భైంసా ప్రభుత్వ ఆసుపత్రిలో ఆర్థోపెడిక్ వైద్యుడు పోస్టుమార్టం చేయడం ఎంటని మండిపడ్డారు. మృతిపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. పోలీసుల తీరుపై బంధువులు, గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తంచేశారు. వైన్‌షాప్ యజమానిని కాపాడేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. చివరికి ముథోల్ సీఐ మల్లేష్ జోక్యం చేసుకొని ఇరువర్గాలను శాంతింపజేశారు.

మద్యానికి బానిసై యువకుడి ఆత్మహత్య

భైంసారూరల్, మార్చి27: మండలంలోని టాక్లీ గ్రామానికి చెందిన తలుపుల రాజు (31) వాటర్ ట్యాంక్‌లో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. స్థానికులు వివరాల ప్రకారం.. టాక్లి గ్రామానికి చెందిన రాజు, అతడి భార్య కొద్దిరోజుల క్రితం ఘర్షణ పడ్డారు. దీంతో ఆమె పుట్టింటికి వెళ్లిపోయింది. అప్పటినుంచి రాజు ప్రతీరోజు మద్యం తాగేవాడు. బుధవారం తలుపుల రాజు మద్యం మత్తులో వాటర్ ట్యాంక్‌లో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

చెక్‌పోస్టు వద్ద లక్షా 40వేల నగదు పట్టివేత

తానూర్, మార్చి27: తానూర్ మండలంలోని బేల్‌తరోడా చెక్‌పోస్టు బుధవారం వద్ద లక్షా 40వేల నగదును పట్టుకున్నట్లు ఎస్సై లోకం సందీప్ తెలిపారు. వాహనాలను తనిఖీ చేస్తుండగా రావన్‌గావ్ నుంచి భైంసా వైపు వెళ్తున్న కదం సాయినాథ్ అనే వ్యక్తి వద్ద నుంచి లక్షా 40వేల నగదు పట్టుకున్నామని, నగదుకు సంబంధించిన ఎలాంటి రశీదులూ చూపించకపోవడంతో నగదును సీజ్ చేసినట్లు తెలిపారు. ప్రజలు రూ.50వేలకు మించి తీసుకెళ్లినప్పుడు డబ్బులకు సంబంధించి ఆధారాలు వెంట ఉంచుకోవాలని ఎస్సై సూచించారు.


నగదును స్వాధీనం చేసుకుంటున్న పోలీసులు

కవిత అరెస్టుతో బీజేపీకి సంబంధం లేదు

● బీజేపీ ఏ పార్టీతోనూ పొత్తు పెట్టుకోదు ● పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ గెలుపు ఖాయం: బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

నిర్మల్ కల్చరల్, మార్చి 27: ఎమ్మెల్సీ కవిత అరెస్టుతో బీజేపీకి సంబంధం లేదని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి స్పష్టం చేశారు. జిల్లాకేంద్రంలో ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థి జి.నగేష్‌తో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వందల కోట్ల లిక్కర్ స్కాములో ఎమ్మెల్సీ కవిత ఆధారాలతో అరెస్టు అయ్యిందని, బీఆర్ఎస్ చేసిన లక్షల కోట్ల కుంభకోణాలు, అరాచకాలు ఒక్కొక్కటిగా బయటకు రాబోతున్నాయని అన్నారు. త్వరలో జరిగే విచారణలో ఆధారాలతో అన్నీ బయటికి వస్తాయని, కుటుంబం మొత్తం కటకటాల్లోకి వెళ్లాల్సిస్తోందని చెప్పారు. కాంగ్రెస్‌తో గానీ, బీఆర్ఎస్‌తో గానీ బీజేపీ ఎప్పుడూ పొత్తు పెట్టుకోలేదని, ఆ అవసరం లేదని అన్నారు. కాంగ్రెస్ బీఆర్ఎస్‌తో గతంలో పొత్తుపెట్టుకుందని గుర్తుచేశారు. బీజేపీ అభ్యర్థిగా జి. నగేష్‌ను ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎంపీ అభ్యర్థిగా ప్రకటించినప్పుడే బీజేపీ అత్యధిక మెజార్టీతో గెలుస్తుందని స్పష్టమైందని అన్నారు. 2లక్షల ఓట్ల మెజార్టీతో గెలుపొందనున్నారని ధీమా వ్యక్తం చేశారు. యూపీఏ పాలనలో అవినీతి, ఎన్నో కుంభకోణాలు, స్కాంలు జరిగాయని అన్నారు. ఐదోస్థానంలో ఉన్న మన ఆర్థిక వ్యవస్థను తీర్చిదిద్ది మూడో స్థానానికి తీసుకెళ్లేందుకు ప్రధాని నరేంద్ర మోదీ కృషి చేస్తున్నారని అన్నారు. తెలంగాణ ప్రాంతంపై మోదీకి అపార అభిమానం ఉండడంతో సంక్షేమ పథకాల అమలులో ప్రాధాన్యతనిస్తున్నారని, 9లక్షల 50వేల కోట్లు ఆర్థిక సహాయం చేసి ఆదుకున్నారని అన్నారు. పదేళ్లుగా మంత్రిగా పనిచేసిన పెద్ద మనిషి రిటైర్మెంట్ బెనిఫిట్ల కోసం పార్టీల చుట్టూ తిరుగుతున్నారని విమర్శించారు. మాస్టర్ ప్లాన్ పేరుతో ఇండస్ట్రియల్ ఏరియాలో ప్రభుత్వ భూములు రిజిస్టర్ చేసుకొని డీమార్ట్‌కు అమ్మారని ఆరోపించారు. వందల ఎకరాలు భూ ఆక్రమణలు చేసిన విషయాలు బయటకొస్తున్నాయని అన్నారు. భూములు కాపాడుకోవడం కోసం అధికార కాంగ్రెస్ పార్టీలోకి వెళ్లే అనేక ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. ఆయన ఎక్కడికి వెళ్లినా చేసిన అవినీతి, భూదందాలు డీ-1 పట్టాలపై వదిలే ప్రసక్తి లేదని స్పష్టం చేశారు.


విలేకరులతో మాట్లాడుతున్న మహేశ్వర్‌రెడ్డి


రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ

అసాంఘిక చర్యలపై నిఘా పెట్టాలి: ఎస్పీ

నిర్మల్ కల్చరల్, మార్చి27: మండలంలో ఎలాంటి అసాంఘిక కార్యక్రమాలు జరుగకుండా నిఘా పెట్టి చర్యలు తీసుకోవాలని ఎస్పీ జానకి షర్మిల పోలీసు అధికారులను ఆదేశించారు. బుధవారం నిర్మల్ జిల్లా సోన్ పోలీస్‌స్టేషన్ ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్‌లో రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితుల ఫిర్యాదులపై సత్వరమే పరిష్కరించాలని సూచించారు. మండలంలో శాంతిభద్రతలు కాపాడాలని అన్నారు. సీసీ కెమెరాల ఏర్పాటు ఆవశ్యకత ప్రజలకు తెలియజేయాలని అన్నారు. ఆర్థిక, సైబర్ నేరాల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. ఆన్‌లైన్ మోసాల పట్ల ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. రిసెప్షన్, టెక్నికల్ గదులను ఎస్పీ పరిశీలించి పలు సూచనలు చేశారు. పోలీసుస్టేషన్ సిబ్బంది యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. తనిఖీల్లో ఎస్సై సంతోషం రవీందర్, తదితరులు ఉన్నారు.

ఎన్నికల విధులను సమర్థవంతంగా నిర్వహించాలి

● కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



ఎన్నికల శిక్షణలో సూచనలిస్తున్న కలెక్టర్


శిక్షణా కార్యక్రమానికి హాజరైన అధికారులు

నిర్మల్ కల్చరల్, మార్చి27: రాబోయే పార్లమెంట్ ఎన్నికలను అధికారులు సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఆదేశించారు. బుధవారం కలెక్టర్ సమావేశ మందిరంలో నియోజకవర్గాల వారీగా ఎన్నికల విధులపై మాస్టర్ ట్రైనర్లకు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పలు సూచనలు చేశారు. అనుక్షణం అప్రమత్తంగా ఉండాలన్నారు. పోలింగ్ సందర్భంగా ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు నిర్వహించాల్సిన విధులు, బాధ్యతలను కలెక్టర్ వివరించారు. మాక్ పోలింగ్ రాజకీయ పార్టీల సమక్షంలో నిర్వహించాలన్నారు. ఈవీఎం, వీవీ ప్యాట్, కంట్రోల్ యూనిట్లలో సాంకేతిక సమస్యలు తలెత్తితే వెంటనే సెక్టోరల్ అధికారులకు సమాచారం అందించాలన్నారు. ప్రతీ రెండు గంటలకోసారి పోలింగ్‌కు సంబంధించిన రిపోర్టులు అందజేయాలన్నారు. పోలింగ్ రిసీవింగ్ సెంటర్లలో ఎన్నికల కమిషన్ నిబంధనలు పాటించాలని సూచించారు. విధులు నిర్లక్ష్యం చేస్తే సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈవీఎంల నిర్వహణ ఛాలెంజ్ ఓట్లు, టెండర్ ఓట్లు, తదితర అంశాలపై శిక్షణలో మాస్టర్ ట్రైనర్లు అవగాహన కల్పించారు. విధుల పట్ల ఎవరూ నిర్లక్ష్యం చేయొద్దని, తమకు అప్పజెప్పిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలన్నారు. ఈ శిక్షణలో అదనపు కలెక్టర్ కిషోర్‌కుమార్, నోడల్ అధికారి రవీందర్ రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

మహిళపై దాడిచేసిన వ్యక్తిపై కేసు

● రిమాండుకు తరలింపు

నర్సాపూర్(జి), మార్చి27: మండలంలోని రాంపూర్ గ్రామానికి చెందిన మంత్రి సవితపై దాడి చేసిన మంత్రి శ్రీదర్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై మునిగెల హన్మాండ్లు తెలిపారు. హోలీ పండుగ రోజు మంత్రి శ్రీధర్ తనపై దాడిచేసి ఇంట్లో వస్తువులను ధ్వంసం చేసినట్లు మంత్రి సవిత ఫిర్యాదు చేయడంతో దర్యాప్తు చేసి నిందితున్ని బుధవారం కోర్టులో హాజరు పరిచినట్లు తెలిపారు. ఆడవారిపై దాడులు చేస్తే ఎలాంటి వారు అయినా ఉపేక్షించేదిలేదని పేర్కొన్నారు.

● బెదిరించిన పలువురిపై కేసు

మండలంలోని చాక్‌పల్లి గ్రామానికి చెందిన కొండ మంగళి చిన్నయ్యను బెదిరింపుకు పాల్పడిన కండెల శ్రీకాంత్, గోంద్ర శివకుమార్, కండెల రవి, బొంతల సతీష్ నలుగురిపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మునిగెల హన్మాండ్లు తెలిపారు.

బాసర ఆలయానికి రెండు హుండీల విరాళం

బాసర, మార్చి 27: బాసర సరస్వతి అమ్మవారి ఆలయానికి తెలంగాణ గ్రామీణ బ్యాంకు చైర్మన్ శోభ రెండు హుండీలను విరాళంగా అందజేశారు. కుటుంబ సభ్యులతో బుధవారం అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం రూ.80వేల విలువైన భక్తుల కానుకలకు ఉపయోగించే రెండు హుండీలను దేవస్థాన అధికారులకు అందజేశారు. అనంతరం దాతలను ఆలయ అధికారులు, పండితులు సన్మానించి ఆశీర్వచనాలు అందించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో విజయరామారావు, రీజినల్ బ్యాంకు మేనేజర్ డీవీఎస్ రామారావు, బాసర శాఖ మేనేజర్ రామలక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.

జేటీవో ఆత్మహత్యకు బాధ్యులైన అధికారులపై చర్య తీసుకోవాలి

● ఎస్పీకి వినతి

నిర్మల్ కల్చరల్, మార్చి27: కడెం ప్రాజెక్టు ఇరిగేషన్ కార్యాలయంలో జూనియర్ టెక్నికల్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న తోకల రాకేష్ ఆత్మహత్యకు బాధ్యులైన అధికారులపై చట్టపర చర్యలు తీసుకోవాలని కోరుతూ బుధవారం ఎస్పీ జానకి షర్మిలకు మున్నూరు కాపు ఉద్యోగ సంక్షేమ సంఘం సభ్యులు వినతిపత్రం అందజేశారు. అధికారుల వేధింపు కారణంగా ఉద్యోగి ఆత్మహత్యకు పాల్పడ్డాడని వినతిపత్రంలో పేర్కొన్నారు. కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఏ.గంగాధర్, బారె శ్రీనివాస్, సభ్యులు సుజయ్, శ్రీహరి, సరిత, పెంట అశోక్, మైస ఆనంద్, టి.నర్సయ్య పాల్గొన్నారు.


ఎస్పీకి వినతిపత్రం ఇస్తున్న నాయకులు